కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -89 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 07-04-2026 | మంగళవారం | పేజీలు : 6

# ట్రంప్ డెడ్‌లైన్ టెన్షన్

## 45 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం కుదిరేనా?

- యుద్ధ ముప్పు పెరుగుతోంది
- గడువు పొడిగించిన ట్రంప్
- ఇరాన్‌పై కఠిన హెచ్చరికలు
- శాంతి ఒప్పందం సందిగ్ధం
- మధ్యవర్తుల ముమ్మర ప్రయత్నాలు
- హార్ముజ్ జలసంధి కీలకం
- అమెరికా–ఇజ్రాయెల్ దాడుల సూచనలు
- గల్ఫ్‌లో ఉద్రిక్త పరిస్థితులు




మిగతాది 2 లో

**న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్):** పశ్చిమాసియా మరో భారీ యుద్ధం అంచున నిలబడింది. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరిన వేళ, 45 రోజుల పాటు తాత్కాలిక 'సీజ్ ఫైర్' ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు అంతర్జాతీయ మధ్యవర్తులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే, ఈ ఒప్పందం కుదిరేందుకు మరింత సమయం పడుతుందని.. మరోవైపు జరగాల్సిన నష్టం జరిగిపోతోందని దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి.

ట్రంప్ హెచ్చరిక.. గడువు పొడిగింపు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువును మరో 20 గంటలు పొడిగించారు. కొత్త డెడ్‌లైన్ ప్రకారం, అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 8 గంటల లోపు ఇరాన్ ఒక నిర్ణయానికి రావాల్సి ఉంటుంది. 'ఒప్పందం కుదరకపోతే, ఇరాన్‌లోని ప్రతి పవర్ ప్లాంట్, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తాం. వారిపై నరకం కురుస్తుంది' అని ట్రంప్ 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' ఇంటర్వ్యూలో భయంకరమైన హెచ్చరికలు జారీ చేశారు.

రెండంచెల శాంతి ప్రణాళిక: ప్రస్తుతం ఇరాన్–అమెరికా చర్చల్లో కీలక ప్రతిపాదనలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా 45 రోజుల పాటు తాత్కాలికంగా యుద్ధాన్ని నిలిపివేయడం. ఈ సమయంలో శాశ్వత శాంతి కోసం చర్చలు జరపడం లాంటి విషయాలు డిస్కస్ చేయనున్నారు. అదేవిధంగా హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను తగ్గించడంపై తుది ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా చూస్తోంది

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

### కార్యకర్తలకు ప్రధాని మోడీ స్పెషల్ విషెస్



2 లో

**న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్):** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలకు ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా స్పెషల్ విషెస్ చెప్పారు. దశాబ్దాలుగా పార్టీ ఎదుగుదల కోసం అంకితభావంతో పనిచేసిన కోట్లాది మంది కార్యకర్తల త్యాగాలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. 'దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ కార్యకర్తలకు స్థాపనా దినోత్సవ శుభాకాంక్షలు.

## పసి ప్రాణంపై మాజీ జవాన్ పైశాచికం




2 లో

**న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్):** మనుషుల్లో రోజురోజుకు మానవత్వం చచ్చిపోతోంది. తాము ఏం చేస్తున్నామనే విచక్షణ లేకుండా ప్రవర్తిస్తూ మానవ జాతికే మచ్చ తెస్తున్నారు. అచ్చం అలాంటి ఘటన తాజాగా హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో వెలుగుచూసింది.

## శ్మశానంలో క్షుద్రపూజలు


### మంత్రగాడి మాయమాటలు నమ్మి అడ్డంగా దొరికిపోయిన వైనం



2 లో

## క్రికెట్ విషయంలో వివాదం..

### విశాఖలో యువకుడి దారుణ హత్య




2 లో

## నమ్మించి వంచించిన కిరాతకుడు

### 'నాన్న జాగ్రత్త' అంటూ యువ టీచర్ ఆత్మహత్య



2 లో

## కోల్‌కతానూ టార్గెట్ చేస్తాం



2 లో

## బీజేపీలో చేరిన టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్




2 లో

## యూపీలో భారీ ఉగ్ర కుట్ర భగ్నం..

### నలుగురు అనుమానితులు అరెస్ట్



2 లో

## మూడేండ్ల పసికందుపై గ్యాంగ్‌రేప్!.. బీహార్‌లో ఘోరం




2 లో

# పగలు దంచే ఎండలు

## సాయంత్రం పిడుగుల వానలు

**న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్):** ఏపీలో రానున్న రెండు రోజుల్లో వింతైన వాతావరణ పరిస్థితులు నెలకొననున్నట్టు సమాచారం. ఒకవైపు భానుడి భగభగలతో జనం అల్లాడుతుంటే, మరోవైపు అకస్మాత్తుగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అయితే మధ్యాహ్నం తీవ్ర ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యే వాతావరణం సాయంత్రానికి వర్షం ఉరుములు, పిడుగులతో గర్జించనుంది. దక్షిణ కోస్తాంధ్ర, పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, అలాగే రాయలసీమ పరిసరాల్లో విస్తరించి ఉన్న మరో ఆవర్తనం కారణంగా ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీనివల్ల సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా మేఘావృతమైన వాతావరణం ఏర్పడి, అక్కడక్కడా పిడుగులు పడే ప్రమాదం ఉంది.

ఏపీలో ఎండల తీవ్రత కూడా రికార్డు స్థాయికి చేరుతోంది. ఆదివారం నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. మన్యం జిల్లా వీరఘట్టం, నెల్లూరుపాలెంలో అత్యధికంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు




2 లో

నమోదయ్యాయి. రేణిగుంటలో 42.3డిగ్రీల, ఒంటిమిట్టలో 41.5 డిగ్రీల, పెదపారుపూడిలో 41.3 డిగ్రీల చొప్పున భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 40 డిగ్రీల పైబడిన ఉష్ణోగ్రతలు ఉండటంతో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఏప్రిల్ 10 నుంచి అసలైన సమ్మర్..!

### ప్రతాపం చూపించనున్న సూర్యుడు



2 లో

**న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్):** తెలంగాణలో ఇక ఎండల తీవ్రత భారీగా పెరగనుంది. గత కొద్దిరోజులుగా అక్కడక్కడా కురిసిన జల్లుల వల్ల వాతావరణం కొంత ప్రశాంతంగా ఉన్నప్పటికీ, ఏప్రిల్ 10 నుండి రాష్ట్రవ్యాప్తంగా 'అసలైన వేసవి' ప్రారంభం కాబోతోందని వాతావరణ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రాబోయే పది రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.

## ముంబైలో 'టాయ్ కారు' బాంబు కలకలం

### ఐసిస్, జైషే ఉగ్రవాదుల భారీ కుట్ర భగ్నం!





2 లో

**న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్):** దేశ ఆర్థిక రాజధాని ముంబై ని ఎవరూ ఊహించని విధంగా భారీ పేలుళ్లతో అతలాకుతలం చేసేందుకు ఉగ్రవాదులు వినూత్న కుట్రను మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధికారులు భగ్నం చేశారు.

# ముఖ్యమంత్రికి షాకిచ్చిన సుప్రీంకోర్టు

## కుటుంబ సభ్యుల కాంట్రాక్టులపై సీబీఐ విచారణకు ఆదేశం

**న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్):** అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండూకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు లో చుక్కెదురైంది. అధికార దుర్వినియోగానికి పాల్పడి, కుటుంబ సభ్యులకు చెందిన కంపెనీలకు భారీ ఎత్తున ప్రభుత్వ కాంట్రాక్టులను కట్టబెట్టారనే ఆరోపణలపై సీబీఐ ప్రాథమిక విచారణకు సుప్రీంకోర్టు ఇవాళ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది సోమవారం ఆదేశించింది. మొత్తం అక్రమాలపై ప్రాథమిక విచారణ జరిపి 16 వారాల్లోపు నివేదికను సమర్పించాలని సీబీఐని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. విచారణకు సంబంధించిన ఎలాంటి రికార్డులు ధ్వంసం కాకుండా చూడాలని అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే గడిచిన పదేళ్లలో ఖండూ బంధువుల సంస్థలకు దక్కిన ప్రతి వర్క్ ఆర్డర్‌ను సీబీఐ క్షుణ్ణంగా పరిశీలించనుంది. రాష్ట్ర పోలీసులు ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించలేరని, కాబట్టి స్వతంత్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐతో విచారణ జరిపించడం అవసరమని కోర్టు అభిప్రాయపడింది. ఈ పరిణామం అరుణాచల్




ప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

రూ.1,270 కోట్ల గోల్‌మాల్..?

సీఎం పెమా ఖండూ తన భార్య, తల్లి, సోదరులకు చెందిన సంస్థలకు సుమారు రూ.1,270 కోట్ల రూపాయల విలువైన పబ్లిక్ వర్క్స్ కాంట్రాక్టులను నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని సీనియర్ అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో 2015 నుంచి 2025 మధ్య కాలంలో జరిగిన వివిధ రకాల కాంట్రాక్టుల కేటాయింపులపై లోతైన విచారణ జరగాలని ధర్మాసనం పేర్కొంది.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్



## ముంబైలో 'టాయ్ కారు' బాంబు కలకలం
## ఐసిస్, జైషే ఉగ్రవాదుల భారీ కుట్ర భగ్నం!

మొదటి పేజీ తరువాయి

రిమోట్ కంట్రోల్‌తో నడిచే బొమ్మ కార్లలో పేలుడు పదార్థాలను అమర్చి, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పేల్చాలని ప్లాన్ చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి పేలుడు పదార్థాలను అమర్చేందుకు సిద్ధం చేసిన ఎలక్ట్రానిక్ బోర్డులు, పదుల సంఖ్యలో రిమోట్ కంట్రోల్ ద్వారా నడిచే వాహనాలను సైతం స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించే నిషేధిత వీడియోలు, పుస్తకాలను సైతం సీజ్ చేశారు. అయితే, నిందితులు ముంబైలోని ప్రముఖ రైల్వే స్టేషన్లు, మతపరమైన ప్రదేశాలు, షాపింగ్ మాల్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ పేలుళ్లకు పథకం రచించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లను పరిశీలిస్తున్న అధికారులు, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ఘటనతో ముంబై పోలీసులు నగరం అంతటా హై అలర్ట్ ప్రకటించారు.

కుట్ర వెనుక విదేశీ హస్తం..?

అరెస్ట్ అయిన నిందితులకు నిషేధిత ఉగ్రవాద సంస్థలు జైషే మహమ్మద్, ఐసిస్ తో సంబంధాలు ఉన్నట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. వీరు సోషల్ మీడియా ద్వారా విదేశాల్లోని తమ హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లుగా ఏటీఎస్ గుర్తించింది. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు చిన్నపిల్లలు ఆడుకునే 'టాయ్ కార్ల'ను బాంబులుగా మార్చే సాంకేతికతను వీరు నేర్చుకున్నట్లుగా విచారణలో బట్టబయలైంది.

## పగలు దంచే ఎండలు.. సాయంత్రం పిడుగుల వానలు

మొదటి పేజీ తరువాయి

సోమవారం పోలవరం జిల్లా చింతూరు, ఎన్టీఆర్ జిల్లాలోని జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో వేడి గాలులు వీచే అవకాశం కూడా ఉందని తెలిపారు.

ఇక ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఉత్తర కోస్తా, మన్యం ప్రాంతాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడవచ్చు. అయితే, వర్షం పడే సమయంలో పిడుగుల పట్ల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. వర్ష సూచన ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత తగ్గదని అధికారులు పేర్కొన్నారు.

## శ్మశానంలో క్షుద్రపూజలు.. మంత్రగాడి
## మాయమాటలు నమ్మి అడ్డంగా దొరికిపోయిన వైనం

న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): అప్పుల ఊబి నుంచి గట్టెక్కేందుకు కొందరు వ్యక్తులు అడ్డదారులు తొక్కి అభాసుపాలయ్యారు. కష్టపడి అప్పులు తీర్చాల్సింది పోయి, మూఢనమ్మకాలతో శ్మశానంలో క్షుద్రపూజలు చేస్తూ స్థానికులకు దొరికిపోయిన ఘటన జోగులాంబ గద్వాల్ జిల్లా నది అగ్రహారం పరిధిలో కలకలం రేపింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఓ మంత్రగాడిని ఆశ్రయించగా, అతను వింత సలహా ఇచ్చాడు. ఒక రాగి రేకు పై బాకీ ఉన్న అప్పుల వివరాలన్నీ రాసి, దానిని శ్మశానంలోని సమాధి వద్ద పాతిపెట్టి ప్రత్యేక పూజలు చేస్తే అప్పుల బాధలన్నీ మాయమవుతాయని నమ్మబలికాడు.

మంత్రగాడి మాటలను గుడ్డిగా నమ్మిన సదరు వ్యక్తులు, నది అగ్రహారం సమీపంలోని శ్మశానవాటికలో అర్ధరాత్రి వేళ క్షుద్ర పూజలు నిర్వహించడం మొదలుపెట్టారు. వీరి కదలికలను గమనించిన స్థానికులు, శ్మశానంలో పూజలు నిర్వహిస్తున్న వారిని చుట్టుముట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆగ్రహంతో వారిపై దేహశుద్ధి చేసి, అనంతరం పోలీసులకు అప్పగించారు. ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఇలాంటి మంత్ర తంత్రాలను, మూఢనమ్మకాలను నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవం.. కార్యకర్తలకు
## ప్రధాని మోడీ స్పెషల్ విషెస్

మొదటి పేజీ తరువాయి

'ఇండియా ఫస్ట్' అనే సిద్ధాంతంతో మన పార్టీ ఎల్లప్పుడూ సమాజ సేవలో అగ్రభాగాన నిలుస్తోంది. నిస్వార్థ సేవ, అచంచలమైన అంకితభావం, సుపరిపాలన పట్ల ఉన్న మక్కువ మా కార్యకర్తల సొంతం' అని ప్రధాని కొనియాడారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్షేత్రస్థాయి కార్యకర్తలు అలుపెరగని కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు.

బీజేపీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమాన్ని తన దార్శనికతకు కేంద్ర బిందువుగా ఉంచుకుంటుందని ప్రధాని స్పష్టం చేశారు. కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కృషిలో ఇది ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని తెలిపారు. 'వికసిత భారతాన్ని నిర్మించాలనే సంకల్పానికి బీజేపీ కట్టుబడి ఉంది. మనందరి సమిష్టి కృషితో ఈ విజన్ ముందుకు సాగాలి. భారతదేశాన్ని పురోగతి, శ్రేయస్సులో కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు.

## నమ్మించి వంచించిన కిరాతకుడు
## 'నాన్న జాగ్రత్త' అంటూ యువ టీచర్ ఆత్మహత్య



న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): తనకు ముందే పెళ్లయిన విషయాన్ని దాచిపెట్టి ఓ కిరాతకుడు ఆడిన ఆటలో ఓ యువ టీచర్ ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్న ఘటన మార్కాపురం జిల్లా పామూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు అయ్యవారిపల్లికి చెందిన మాధవి (24) స్థానికంగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో నాగూర్ భాష అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. అయితే, నాగూర్ భాష కు ఇదివరకే వివాహం అయినట్లుగా మాధవికి ఆలస్యంగా తెలిసింది. నిజం తెలుసుకున్న ఆమె, అతడి దూరం పెట్టాలని నిర్ణయించింది.

అయితే, మాధవి తనను దూరం పెడుతోందన్న కోపంతో నాగూర్ భాష రాక్షసుడిలా మారాడు. వారిద్దరూ కలిసి ఉన్న సమయంలో తీసుకున్న వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో పెడతానని, పరువు తీస్తానని బెదిరించడం మొదలుపెట్టాడు. ఆ వేధింపులు రోజురోజుకు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన మాధవి, ఆత్మహత్యే శరణ్యమని భావించింది. ఆత్మహత్యకు ముందు మాధవి తన చేతిపై 'నాన్న జాగ్రత్త' అని పెన్నుతో రాసుకుని తన గదిలో ఉరి వేసుకుంది. తన తర్వాత తన తండ్రి ఒంటరి అవుతాడనే ఆవేదనతో ఆమె చేసిన ఆ చివరి అక్షరాలు ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టిస్తున్నాయి. కుటుంబ సభ్యులు గమనించే లోపే ఆమె ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ క్రమంలోనే మాధవి మృతికి కారణమైన నాగూర్ భాషపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఒక ఆడపిల్ల జీవితంతో ఆడుకుని, ఆమె చావుకు కారణమైన వ్యక్తిని వదలకూడదని గ్రామస్థులు సైతం డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఏప్రిల్ 10 నుంచి అసలైన సమ్మర్..!
## ప్రతాపం చూపించనున్న సూర్యుడు



**న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్):** తెలంగాణలో ఇక ఎండల తీవ్రత భారీగా పెరగనుంది. గత కొద్దిరోజులుగా అక్కడక్కడా కురిసిన జల్లుల వల్ల వాతావరణం కొంత ప్రశాంతంగా ఉన్నప్పటికీ, ఏప్రిల్ 10 నుండి రాష్ట్రవ్యాప్తంగా 'అసలైన వేసవి' ప్రారంభం కాబోతోందని వాతావరణ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రాబోయే పది రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై భానుడు ప్రతాపం చూపనున్నాడు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ముఖ్యంగా సింగరేణి ప్రాంతాల్లో ఎండలు భీకరంగా ఉండనున్నాయని, 41°C నుండి 43°C వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా ఎండల ప్రభావం గట్టిగానే ఉండబోతోంది. నగరంలో 'హీట్ ఐలాండ్' ప్రభావంతో ఉష్ణోగ్రతలు 40°C మార్కును చేరుకోనున్నాయని సమాచారం. అయితే తీవ్రమైన వేడి కారణంగా స్థానికంగా ఏర్పడే అల్పపీడన ద్రోణుల వల్ల అక్కడక్కడా ఉరుములతో కూడిన వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉంది. అయితే, ఈ వర్షాలు కేవలం కొద్దిసేపు మాత్రమే ఉపశమనాన్ని ఇస్తాయని, భూమిలో వేడి పెరగడం వల్ల వర్షం పడిన తర్వాత ఉక్కపోత మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పసి ప్రాణంపై మాజీ జవాన్ పైశాచికం

మొదటి పేజీ తరువాయి

కేవలం కొన్ని జామకాయలు దొంగిలించిందనే నెపంతో ఒక చిన్నారిపై ఓ మాజీ ఆర్మీ ఉద్యోగి అత్యంత క్రూరంగా ప్రవర్తించాడు. ఆ బాలికను కుక్కను కట్టేసినట్లు గొలుసులతో బంధించి, కర్రతో చితకబాదాడు. ఈ అమానుషానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

స్థానికుల సమాచారం ప్రకారం.. ఓ మాజీ సైనిక ఉద్యోగి తమ తోటలో అభంశుభం తెలియని ఓ బాలిక జామకాయలు కోసిందన్న కోపంతో ఇంట్లోకి పట్టుకొచ్చాడు. శిక్షాస్మృతిని మరిచిపోయి, తనే న్యాయ నిర్ణేతలా వ్యవహరించాడు. బాలిక రెండు చేతులను, కాళ్లను గొలుసులతో కలిపి తాళం వేశాడు. భయంతో వణికిపోతున్న ఆ చిన్నారిని కనికరించకుండా కర్రతో పదే పదే కొట్టాడు. నిందితుడు చేస్తున్న ఈ పైశాచికాన్ని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వీడియోలో ఆ బాలిక గొలుసులతో బంధించబడి ఉండటం, నిందితుడు ఆమెను బెదిరిస్తూ కొడుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు 'ఒక మాజీ సైనికుడివై ఉండి ఇలాగేనా ప్రవర్తించేది?' అంటూ నిందితుడిపై విరుచుకుపడుతున్నారు. అయితే, ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఉనా పోలీసులు తక్షణమే స్పందించారు. వీడియో ఆధారంగా నిందితుడిని గుర్తించి, అతనిపై బాలల హక్కుల పరిరక్షణ చట్టం, ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లుగా పోలీసులు ధృవీకరించారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు.

## ట్రంప్ డెడ్‌లైన్ టెన్షన్
## 45 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం కుదిరేనా?

మొదటి పేజీ తరువాయి

పాకిస్థాన్, ఈజిప్ట్ మధ్యవర్తిత్వం: పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ దేశాలు ఇరాన్, అమెరికా చర్చల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ట్రంప్ రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఫోన్‌లో మాట్లాడినట్లుగా తెలుస్తోంది. అయితే, ఇస్లామాబాద్‌లో అమెరికా అధికారులతో నేరుగా భేటీ అయ్యేందుకు ఇరాన్ నిరాకరించింది. అమెరికా ప్రతిపాదనలు తమకు అంగీకారయోగ్యం కాదని ఇరాన్ స్పష్టం చేసింది. ఒకవేళ చర్చలు విఫలమైతే, అమెరికా-ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ ఇంధన వనరులపై దాడులు చేసే అవకాశం ఉంది. దీనికి ప్రతికారంగా గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలు, నీటి శుద్ధి ప్లాంట్లపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరిస్తోంది. హార్ముజ్ జలసంధిలో పరిస్థితులు మునుపటిలా ఉండబోవని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించడం ఆందోళన కలిగిస్తోంది.

## బీజేపీలో చేరిన టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్

న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): పశ్చిమ బెంగాల్‌లో నువ్వానేనా? అన్నట్టుగా ఎన్నికల ప్రచారం జరుగుతోంది. అధికార టీఎంసీ-బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇలాంటి తరుణంలో ఇటీవల టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ బీజేపీలో చేరారు. ఢిల్లీలో కేంద్రమంత్రుల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు.

తాజాగా లియాండర్ పేస్‌కు కేంద్రం అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎక్స్-కేటగిరీ భద్రత కల్పించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎక్స్ కేటగిరీ భద్రతను కల్పించడంతో పాటు రక్షణ కోసం సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించింది. పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న రాజకీయ కార్యకలాపాల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. బీజేపీలో చేరిన వారం రోజులకే కేంద్రం ఇంత భద్రత కల్పించడంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

లియాండర్ పేస్ బీజేపీలో చేరక ముందు తృణమూల్ కాంగ్రెస్‌లో ఉండేవారు. అయితే పార్టీలో ప్రాధాన్యత లేకపోవడంతో ఎన్నికల సమయంలో బీజేపీలో చేరారు. అయితే ఈ ఎన్నికల్లో పేస్‌కు సీటు కేటాయించలేదు. కేవలం ప్రచారం చేస్తున్నారు.

## లవర్ తో భార్య జంప్.. పట్టుకుని
## కత్తితో పొడిచి చంపిన భర్త



న్యూస్ డెస్క్ 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): ప్రియుడితో పారిపోయిన భార్యను పట్టుకుని కిరాతకంగా చంపాడో భర్త. ఈ దారుణం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో చోటు చేసుకుంది. జహీరాబాద్ కు చెందిన కవిత (29), సిద్దారెడ్డి భార్యభర్తలు. కవితకు పవన్ రెడ్డి అనే మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో గత నెల 27న తన ప్రియుడు పవన్‌తో కలిసి కవిత పారిపోయింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కవిత అదృశ్యమైనట్లు మార్చి 30న జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు జడ్చర్లలో ప్రియుడు పవన్‌తో కలిసి కవిత ఉన్నట్లు గుర్తించారు.

తీసుకువస్తుండగా ఎటాక్: దీంతో కవితను తిరిగి జహీరాబాద్ తీసుకువచ్చేందుకు పోలీసులు జడ్చర్ల బయలుదేరారు. పోలీసులతో పాటు భర్త సిద్ధారెడ్డి సైతం వెళ్లాడు. అక్కడి నుంచి కవితను తీసుకుని కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. అయితే భార్య చేసిన పనికి లోలోపల రగిలిపోతున్న సిద్ధారెడ్డి సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది సమీపంలోకి కారు రాగానే ఒక్కసారిగా తన వద్ద ఉన్న కత్తితో భార్యపై దాడి చేశాడు. కవిత గొంతులో కత్తితో పొడిచాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కవితను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలించేలోపే ఆమె మృతి చెందింది. ఈ హత్య ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## క్రికెట్ విషయంలో వివాదం..
## విశాఖలో యువకుడి దారుణ హత్య

న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): క్రికెట్ విషయంలో తలెత్తిన ఓ వివాదం యువకుడి దారుణ హత్యకు దారి తీసిన ఘటన విశాఖపట్నంలో వెలుగు చూసింది.. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడిని కత్తితో పొడిచి హతమార్చిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతుడు పెదగదిలి కొండవాలుకు చెందిన డిగ్రీ విద్యార్థి డోల అజిత్ (23)గా గుర్తించారు. సమాచారం ప్రకారం, క్రికెట్ ఆట విషయంలో అజిత్ మరియు కిషోర్ అనే వ్యక్తి మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. గతవారం పోలమాంబ పండుగ సమయంలో కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో నిన్న రాత్రి మద్యం మత్తులో ఉన్న కిషోర్, పెదగదిలి జంక్షన్ వద్ద అజిత్‌ను కలుసుకుని మళ్లీ గొడవకు దిగాడు. ఈ గొడవలో ఆగ్రహానికి గురైన కిషోర్ కత్తితో అజిత్‌ను పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన అజిత్‌ను కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అజిత్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఇక, ఘటన అనంతరం నిందితుడు కిషోర్ స్వయంగా ఆరిలోవ పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## యూపీలో భారీ ఉగ్ర కుట్ర భగ్నం..
## నలుగురు ఉగ్ర అనుమానితులు అరెస్ట్



న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): ఉత్తరప్రదేశ్‌లో భారీ ఉగ్ర కుట్రను యూపీ ఏటీఎస్ భగ్నం చేసింది. రైల్వేట్రాక్‌లు, షోరూమ్‌లు లక్ష్యంగా ఉత్తరప్రదేశ్‌లో భారీగా కుట్రకు ప్రణాళిక రచించిన ముఠాను ఏటీఎస్ సంస్థ వలపన్ని పట్టుకుంది. నలుగురు అనుమానితులను అరెస్ట్ చేసింది. మీరట్, నోయిడా నివాసులైన సాకిబ్ అలియాస్ డెవిల్, అరబాబ్, లోకేష్ పండిట్ అలియాస్ పాప్లా, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్‌లను అరెస్టు చేశారు. వీళ్లంతా పాకిస్థాన్ ఐఎస్ఐ కనుసన్నల్లో నడుస్తున్నట్లుగా గుర్తించింది.

లక్నో, మీరట్‌తో సహా పలు నగరాల్లోని రైల్వే ట్రాక్‌ల వెంబడి ఉన్న కార్ షోరూమ్‌లు, గ్యాస్ సిలిండర్లతో నిండిన ట్రక్కులు, సిగ్నల్ బాక్సులను లక్ష్యంగా చేసుకుని పేల్చేసేందుకు ముఠా సన్నాహాలు చేస్తున్నట్లు ఆధారాలు సేకరించింది. నిప్పుపెట్టి, భయాందోళనలు సృష్టించడం వీరి లక్ష్యంగా తెలిపింది. సాకిబ్ అలియాస్ డెవిల్ ద్వారా ముఖ్యమైన స్థావరాలపై నిఘా పెట్టినట్లుగా దర్యాప్తులో వెల్లడైంది. ఫొటోలు, వీడియోలు పంపే నెట్‌వర్క్‌లో లోకేష్ పండిట్ అలియాస్ పాప్లా, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్ వంటి వారు పాలుపంచుకున్నారు. డబ్బు ఆశతో భారీ దాడికి ప్లాన్ చేసినట్లుగా కనిపెట్టింది.

మార్చి 4వ తేదీన బిజ్నోర్‌లో ఒక పికప్ వాహనానికి నిప్పంటించినట్లు కూడా దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనకు సాకిబ్ అలియాస్ డెవిల్ ముఠానే పాల్పడినట్లుగా తెలిపింది. దీనికి సంబంధించిన వీడియోను టెలిగ్రామ్ ద్వారా పాకిస్థాన్‌లో ఉన్న ఒక ఐఎస్ఐ హ్యాండ్లర్‌కు పంపారు. పాకిస్థాన్‌లో ఉన్న ఐఎస్ఐ హ్యాండ్లర్, పలు ముఖ్యమైన కంటోన్మెంట్ ప్రాంతాలు, సైనిక కదలికలు, కీలకమైన స్థావరాల గూగుల్ లొకేషన్ల స్క్రీన్ రికార్డింగ్‌లను పంపుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీని తర్వాత లక్ష్యంగా చేసుకున్న ప్రదేశాల రెక్కీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలను అభ్యర్థించడం జరిగినట్లుగా కనిపెట్టింది.

బదులుగా ఐఎస్ఐ హ్యాండ్లర్.. సాకిబ్ అలియాస్ డెవిల్ పేర్కొన్న బ్యాంకు ఖాతాలకు క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బు పంపేవాడు. మొబైల్ ఫోన్ దర్యాప్తు సమయంలో యూపీ ఏటీఎస్ మీరట్, అలీగఢ్, ఘజియాబాద్‌లోని పలు కార్ షోరూమ్‌ల వీడియోలను కూడా కనుగొంది. లక్ష్యాలను ఛేదించడానికి ముందే ఈ వీడియోలను ఐఎస్ఐ హ్యాండ్లర్‌కు పంపేవారు. సాకిబ్ అలియాస్ డెవిల్ సోషల్ మీడియాలో ఆయుధాల రీళ్లను పోస్ట్ చేసినట్లు కూడా దర్యాప్తులో కనుగొన్నారు.

## మూడేండ్ల పసికందుపై గ్యాంగ్‌రేప్!.. బీహార్‌లో ఘోరం

న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): బీహార్‌లోని పాట్నాలో అత్యంత హేయమైన ఘటన చోటుసుకున్నది. డ్రగ్స్‌కు బానిసైన 22 ఏండ్ల యువకుడు, మరో ఇద్దరు కలిసి.. మేనకోడలైన మూడేండ్ల బాలికపై గ్యాం గ్‌రేప్‌నకు పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో బాధిత బాలికకు పాట్నాలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందిస్తున్నామని, దోషులకు కఠిన శిక్షపడేలా చూస్తామని జిల్లా పోలీస్ ఉన్నతాధికారి రంజన్‌కుమార్ ఆదివారం విలేకర్లకు తెలిపారు.

ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని, ఎఫ్ఎస్ఎల్ బృందం నుంచి వచ్చే నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు ఉం టుందన్నారు. బాలిక తల్లి పోలీసులకు తెలిపిన సమాచారం ప్రకారం, డ్రగ్స్‌కు బానిసైన నిందితుడు నిద్రిస్తున్న బాలికను చెట్లపొదల్లోకి ఎత్తుకెళ్లి దారుణానికి పాల్పడినట్టు చెప్పింది. బాలిక అరుపులతో చుట్టుపక్కల వాళ్లు అప్రమత్తమవడంతో బాలికను అక్కడే వదిలేసి ప్రధాన నిందితుడు సహా, అతడి స్నేహితులు ఘటనాస్థలం నుంచి పారిపోయారు. బాలికను గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

## కోల్‌కతానూ టార్గెట్ చేస్తాం

న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): భవిష్యత్‌లో భారత్ తమపై ఏదైనా దాడులకు పాల్పడితే కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని, ప్రతి దాడులను ఆ ప్రాంతం వరకు తీసుకుని వెళ్తామని పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి ప్రేలాపనలు చేశారు. తన స్వస్థలం సియాల్‌కోట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి, వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్టు నివేదికలు ఉన్నాయని ఆరోపించారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకుని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల భారత్ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ హెచ్చరికలపై ఖవాజా ఇప్పటికే తన అక్కసు వెళ్లగక్కారు.

## ఈ నెల 25న కొత్త పార్టీ.. డీటీ నాయక్‌తో కవిత భేటీ



న్యూస్ డెస్క్, 06 ఏప్రిల్ (బిఎన్ఎస్): ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో కల్వకుంట్ల కవిత తన కసరత్తు వేగవంతం చేశారు. ఈ మేరకు ప్రముఖులతో సమావేశమై కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో కవిత భేటీ అయ్యారు. హైదరాబాద్ లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత అక్కడ మర్యాదపూర్వకంగా ఆయనతో పాటు పలువురు బంజారా ప్రముఖులతో సమావేశమయ్యారు. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు, తెలంగాణలో బంజారా సమాజం కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆరా తీశారు. బంజారా ప్రముఖులు తాము ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీకి సలహాలు, సూచనలు అందజేయాలని ఈ సందర్భంగా కవిత కోరారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే వారికి తాము ఏర్పాటు చేయబోయే పార్టీలోకి స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిథ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని.. తాము ఏర్పాటు చేయబోయే పార్టీలకు బంజారా సమాజానికి సముచిత అవకాశాలు ఇస్తామని కవిత హామీ ఇచ్చారు.

# నమ్మకమే బలంగా మారిన మెసారా ఇన్‌ఫ్రా

## కొల్లూరులో కస్టమర్ల విశ్వాసంతో ముందుకు సాగుతున్న ప్లాట్ యజమానులు

MESARA
Infra Developers Limited

కొల్లూరు భూముల వ్యవహారంలో ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా మెసారా ఇన్‌ఫ్రా సంస్థపై కస్టమర్లలో పెరుగుతున్న విశ్వాసం ఈ పరిణామానికి కేంద్రబిందువుగా మారింది. రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, నాణ్యత, చట్టబద్ధతతో వ్యవహరిస్తున్న సంస్థగా మెసారా ఇన్‌ఫ్రా పేరు సంపాదించుకోవడంతో, ప్లాట్ యజమానులు పెద్ద సంఖ్యలో ఈ సంస్థపై నమ్మకం ఉంచుతున్నారు.

కస్టమర్లకు పూర్తి సమాచారం అందించడం, లావాదేవీల్లో స్పష్టత పాటించడం, చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించడం వంటి అంశాలు మెసారా ఇన్‌ఫ్రాను విశ్వసనీయ వేదికగా నిలబెట్టాయి. "మా పెట్టుబడులు సురక్షితంగా ఉండాలంటే నమ్మకమైన సంస్థ అవసరం" అన్న భావనతో యజమానులు ఈ సంస్థ వైపు మొగ్గు చూపుతున్నారు.

ఈ విశ్వాసం క్రమంగా ఒక ఐక్యతగా మారుతోంది. గతంలో విడివిడిగా ఉన్న ప్లాట్ యజమానులు ఇప్పుడు మెసారా ఇన్‌ఫ్రా చుట్టూ ఒకటై నిలుస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించుకునే దిశగా ఒకే వేదికపైకి చేరడం, సంఘటితంగా ముందుకు సాగడం ఈ పరిణామంలో ప్రధాన లక్షణంగా మారింది.

మెసారా ఇన్‌ఫ్రా అధినేత మారెళ్ల పెంచల సుబ్బారెడ్డి నాయకత్వం కూడా ఈ విశ్వాసాన్ని మరింత బలపరుస్తోంది. విలువలకు కట్టుబడి వ్యవహరించే వ్యక్తిగా ఆయనకు ఉన్న గుర్తింపు, కస్టమర్లలో నమ్మకాన్ని పెంచింది. ఈ నమ్మకమే ఇప్పుడు కొల్లూరు అంశంలో ప్లాట్ యజమానులను ఒకే దిశగా నడిపిస్తోంది.

కొల్లూరు భూముల చరిత్ర -- చట్టబద్ధతకు ఆధారం

కొల్లూరు ప్రాంతంలో 1984లో భూములు అధికారికంగా ప్లాట్లుగా విభజించబడ్డాయి. అప్పటి చట్టపరమైన విధానాల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యి, వేలాది మంది కొనుగోలు దారులు తమ పేర్లపై హక్కులను నమోదు చేసుకున్నారు. ఈ లావాదేవీలు పూర్తిగా చట్టబద్ధమైనవేనని యజమానులు చెబుతున్నారు.

కాలక్రమేణా ఈ ప్లాట్లు పలుమార్లు చేతులు మారినా, ప్రతి సారి చట్టబద్ధ రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించడం జరిగింది. అందువల్ల ప్రస్తుతం ఉన్న ప్లాట్ యజమానులకే అసలైన యాజమాన్య హక్కులు ఉన్నాయని వారు స్పష్టం చేస్తున్నారు.

అభివృద్ధి ప్రభావం -- వివాదాల ఆవిర్భావం

2002లో అవుటర్ రింగ్ రోడ్ ప్రతిపాదన వచ్చిన తరువాత కొల్లూరు ప్రాంతం ప్రాధాన్యం పెరిగింది. భూముల విలువలు పెరగడంతో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి.

అయితే ఈ సమయంలో చోటుచేసుకున్న కొన్ని లావాదేవీలు వివాదాలకు దారి తీశాయి. ఇప్పటికే ప్లాట్లుగా ఉన్న భూములను ఎకరాలుగా చూపిస్తూ విక్రయాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిణామాలు అసలు యజమానుల హక్కులను ప్రభావితం చేశాయి.

న్యాయపరమైన పరిణామాలు -- యజమానులకు బలం

కొల్లూరు అంశం న్యాయపరమైన దిశలోకి వెళ్లిన తరువాత చట్టబద్ధ రిజిస్ట్రేషన్ల ప్రాముఖ్యత మరోసారి ముందుకు వచ్చింది. ఇది ప్లాట్ యజమానుల వాదనకు బలాన్ని చేకూర్చింది.

ఈ పరిణామాల తరువాత యజమానుల్లో నమ్మకం పెరిగింది. తమ హక్కులు చట్టబద్ధమైనవేనన్న విశ్వాసంతో వారు మరింత సంఘటితంగా ముందుకు సాగుతున్నారు.

మెసారా ఇన్‌ఫ్రా -- నమ్మకానికి కేంద్రబిందువు

ప్రస్తుతం కొల్లూరు అంశంలో మెసారా ఇన్‌ఫ్రా సంస్థ ఒక కీలక వేదికగా నిలుస్తోంది. చట్టబద్ధత, పారదర్శకతతో వ్యవహరిస్తున్న సంస్థగా దీనిపై ప్లాట్ యజమానులు విశ్వాసం ఉంచుతున్నారు.

తమ సమస్యలను అర్థం చేసుకుని సరైన మార్గంలో పరిష్కారం చూపగల సంస్థ ఇదేనన్న భావన బలపడుతోంది. ఈ కారణంగా యజమానులు పెద్ద సంఖ్యలో మెసారా ఇన్‌ఫ్రా వెంట నడవాలని నిర్ణయిస్తున్నారు.

ఐక్యతగా మారుతున్న విశ్వాసం

గతంలో విడివిడిగా ఉన్న ప్లాట్ యజమానులు ఇప్పుడు ఒకే వేదికపైకి చేరుతున్నారు. వ్యక్తిగతంగా కాకుండా సమిష్టిగా ముందుకు సాగితేనే విజయం సాధ్యమని వారు భావిస్తున్నారు.

మెసారా ఇన్‌ఫ్రాతో కలిసి నడవడం ద్వారానే తమ హక్కులను సాధించగలమన్న నమ్మకం వారిలో పెరిగింది. ఈ ఐక్యతే ఇప్పుడు ఉద్యమానికి ప్రధాన బలం.

ముగింపు -- విశ్వాసం చూపిస్తున్న దారి

మొత్తం మీద, కొల్లూరు భూముల అంశం ఇప్పుడు ఒక కీలక దశలో ఉంది. మెసారా ఇన్‌ఫ్రాపై కస్టమర్ల పెరుగుతున్న విశ్వాసం, ప్లాట్ యజమానుల ఐక్యత, చట్టబద్ధతపై నిలిచిన పోరాటం -- ఇవన్నీ కలిసి సమస్య పరిష్కారానికి దారి చూపుతున్నాయి.

ఈ విశ్వాసం మరింత బలపడుతున్న కొద్దీ, కొల్లూరు అంశం త్వరలోనే స్పష్టమైన పరిష్కారాన్ని అందుకుంటుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి.

# 'ప్రజా పాలన' – ప్రగతి ప్రణాళిక ...!





**హైదరాబాద్:** తెలంగాణ గడ్డపై ఇంద్రవెల్లి అమరవీరుల సాక్షిగా, అమరజ్యోతి సాక్షిగా కొలువుదీరిన 'ప్రజా ప్రభుత్వం' నేడు ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి అలుపెరగని పోరాట యోధుడిలా రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తును సరికొత్తగా ఆవిష్కరిస్తున్నాయి. నిరంకుశత్వానికి చరమగీతం పాడుతూ, సచివాలయ ద్వారాలను సామాన్యుడి కోసం తెరిచిన 'ప్రజా పాలకుడు'గా రేవంత్ రెడ్డి అరుదైన ముద్ర వేసుకున్నారు.

**అభయహస్తం: ఆరు గ్యారెంటీలతో భరోసా**

పాలనలో వేగాన్ని, మానవీయతను జోడించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరు గ్యారెంటీలు' నేడు ప్రతి ఇంటికీ చేరుతున్నాయి. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి వారి ఆర్థిక స్వవలంబనకు తోడ్పడటమే కాకుండా, ?500 లకే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డల కళ్లలో ఆనందాన్ని నింపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ మధ్యతరగతి, పేద కుటుంబాల భారానికి ఊరటనిచ్చారు. ఈ పథకాల అమలు తీరు రేవంత్ రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది.

**యువతకు ఊపిరి.. నిరుద్యోగుల ఆశాజ్యోతి**

గత పదేళ్లుగా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతలో రేవంత్ రెడ్డి కొత్త ఆశలు రేకెత్తించారు. అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే సుమారు 30 వేల మందికి పైగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేసి 'జాబ్ క్యాలెండర్' దిశగా అడుగులు వేశారు. టీజీపీఎస్సీ (TGPsc) ప్రక్షాళన ద్వారా పారదర్శకతను తీసుకొచ్చి, గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో వేగం పెంచడం ద్వారా యువతకు ఆయన అసలైన భరోసాగా నిలిచారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం స్కిల్ యూనివర్సిటీ వంటి వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు.

**రైతు బాంధవుడు: రుణమాఫీతో నవశకం**

"రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అని నమ్మే రేవంత్ రెడ్డి, రైతు రుణమాఫీ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. గత ప్రభుత్వాల మొండి బకాయిలను సైతం లెక్కచేయకుండా, అన్నదాతను అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు వేల కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా ఆయన చేస్తున్న క్షేత్రస్థాయి పర్యటనలు రైతుల్లో నమ్మకాన్ని రెట్టింపు చేశాయి.



**మూసీ పునరుజ్జీవం: విశ్వనగరంగా హైదరాబాద్**

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే క్రమంలో 'మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు' రేవంత్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం. కలుషితమైన మూసీ నదిని శుద్ధి చేసి, ఇరువైపులా పచ్చదనంతో కూడిన పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం ద్వారా నగర ముఖచిత్రాన్ని మార్చేందుకు ఆయన కృతనిశ్చయంతో ఉన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించి ఇండస్ట్రియల్ హబ్‌లను అభివృద్ధి చేయడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయన విదేశీ పర్యటనలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

**ప్రజావాణి: గడప గడపకూ పాలన**

ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా వినతులు స్వీకరిస్తూ ప్రజల కష్టాలను తీరుస్తున్నారు. పారదర్శకత, జవాబుదారీతనం ప్రాతిపదికన సాగుతున్న ఈ పాలనలో అవినీతికి తావులేకుండా యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. సామాన్యుడి గొంతుకను గౌరవించే రేవంత్ రెడ్డి, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారమే పరమావధిగా ముందుకు సాగుతున్నారు.

**ముగింపు:**

ఢిల్లీలో తన మార్క్ దౌత్యాన్ని ప్రదర్శిస్తూనే, రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్న రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ నేడు సుభిక్షం వైపు సాగుతోంది. మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధిని చూపిస్తున్న ఆయన 'ప్రజల ముఖ్యమంత్రి'గా అందరి నీరాజనాలు అందుకుంటున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెడతారనడంలో ఎటువంటి సందేహం లేదు.





యలమంచిలి విశ్వనాథన్

# రైతులకు కలెక్టర్ వినతి



నల్లగొండ (బిఎన్ఎస్) రబీలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు... నల్గొండ సమీపంలోని ఆర్జల బావి వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని తూర్పారబట్టి తాలు, తరుగు, చెత్త వంటివి లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని తీసుకు వచ్చినట్లయితే రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్" ఏ" ధాన్యానికి ప్రకటించిన 2389 రూపాయలు, కామన్ వెరైటీకి 2369 రూపాయల మద్దతు ధరను పొందవచ్చని తెలిపారు. ఇందుకోసం .కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తూర్పురబట్టే యంత్రాలను సిద్ధంగా ఉంచినట్లు ఆయన వెల్లడించారు. ఈ రబీలో జిల్లాలో 401 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు 124 రైస్ మిల్లులను అనుసంధానం చేయగా, కొనుగోలు కేంద్రాలలో అవసరమైన తేమ కొలిచే యంత్రాలు ,తూర్పారబట్టే యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు అన్ని సిద్ధంగా ఉంచడం జరిగిందని అన్నారు.. ,

# ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వండి...కడప ఎస్పీ నచ్చికేత్



కడపజిల్లా (బిఎన్ఎస్) ఏప్రిల్ 06 : పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యతతో నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పాల్గొని,జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు.ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.మొత్తం 114 ఫిర్యాదులు ప్రజా పరిష్కార వేదికకు వచ్చాయన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు.చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ప్రజా పరిష్కార వేదిక కొచ్చిన ప్రజలకు భరోసా ఇచ్చారు.

ఎస్పీ నచ్చికేత్ పేర్కొన్న ముఖ్య అంశాలు

పోలీస్ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం,ప్రజల నుండి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తాం అని ప్రజా ఫిర్యాదు ధరలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవించుకున్నారు. వాటిపై సంబంధిత పోలీస్ అధికారులతో జిల్లా ఎస్.పి నేరుగా మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)కె.ప్రకాష్ బాబు,మహిళాపి.ఎస్, డి.ఎస్.పి బాలస్వామిరెడ్డి, పాల్గొన్నారు...

# ఒంటిమిట్ట కోదండ రామయ్యకు పుష్పయాగ మహోత్సవం



కడపజిల్లా(బిఎన్ఎస్)ఏప్రిల్ 06: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో పుష్పయాగ మహోత్సవం భక్తి భరితంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి,ఆలయశుద్ధి, నిత్యారాధనలు నిర్వహించారు.సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది.తులసీదళాలు,మల్లెలు, రోజాలు,చామంతులు, గన్నేరు,సంపంగి,మొగలి దళం వంటి పుష్పాలు, పత్రాలతోస్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి సుమారు 3 టన్నుల పుష్పాలు విరాళంగా ఒంటిమిట్ట కోదండ రామయ్యకు అందాయి.ప్రకృతివైపరీత్యాలు తొలగి భక్తులు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థిస్తూ,భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు పుష్పయాగం నిర్వహిస్తారు.అలాగే నిత్యకైంకర్యాలలో తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈయాగాన్ని చేస్తారని అర్చకులు తెలిపారు.ఈ యాగం ద్వారా దోషాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని అర్చకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సదాశివరావు, డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి,గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు,టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్,ఆలయ అర్చకులు,పెద్దసంఖ్యలో భక్తులు పుష్పయాగ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అధికారులపై ఫిర్యాదు

నూజివీడు (బిఎన్ఎస్): ప్రభుత్వ అధికారులే తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారని సమాచార హక్కు చట్టం ప్రతినిధి తిరివీధి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. నూజివీడులో సబ్ కలెక్టర్ కు సోమవారం మీకోసం లో అర్జీ దాఖలు చేశారు. కృష్ణ మాట్లాడుతూ నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా, వ్యతిరేక ధోరణి ప్రదర్శిస్తున్నారని వాపోయారు. రెవిన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు పట్టడానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే సామాన్య ప్రజలు, సమీప జిల్లాల నుండి వచ్చే రోగులతో నిత్యం నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి కిటకిట లాడుతోందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు పెట్టలేని నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ప్రభుత్వ ఆసుపత్రులను వైద్యం కోసం ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. సామాన్యుల పేదరికాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకున్న ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించటం దారుణం అన్నారు.

# బీజేపీ కార్యాలయం ప్రారంభం



భీమిలి (బిఎన్ఎస్ న్యూస్) విశాఖ జిల్లా భీమిలి మండలం జీరుపేట వద్ద బిజెపి కార్యాలయం ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. పార్టీ అజెండా ను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలి అని సూచించారు.

# కారులో అకస్మాత్తుగా మంటలు



విజయవాడ (బిఎన్ఎస్): కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ పై సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా ఒక కారులో మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది.కారులో నుంచి ఒక్కసారిగా పొగలు రావడం గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. కాసేపటికే మంటలు వచాయి . సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు.

# రాపూరులో బిజెపి ఆవిర్భావ వేడుకలు



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):-నెల్లూరు జిల్లా రాపూరులో భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మన ఊరు మన జెండా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ రాపూరు మండల అధ్యక్షులు దూడల పెంచలయ్య ఆధ్వర్యంలో బిజెపి జెండాను కార్యకర్తలు అందరితో కలిసి ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జై భారత్, కిసాన్ భారత్, భారత్ మాతాకీ జై అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం బిజెపి నాయకులు మాట్లాడుతూ దేశ ప్రయోజనాలే పరమావధిగా బిజెపి పార్టీ పనిచేస్తుందని, మన ప్రధానమంత్రి నరేంద్ర మోది నాయకత్వంలో దేశం అభివృద్ధి పదంలో దూసుకుపోతుందన్నారు. , రాపూరు మండలంలో ప్రతి గ్రామంలోను బీజేపీ జెండాను ఆవిష్కరించామన్నారు. నాయకత్వంపై నమ్మకం, సిద్ధాంతాల పట్ల గౌరవం ఇవే బిజెపి పార్టీని ఉన్నత స్థాయికి చేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తిక్కమునేని వెంకటరత్నం నాయుడు, తిరుపతి జనార్ధన్, శివప్రసాద్, కరిపం సుబ్రహ్మణ్యం, ప్రదీప్ రెడ్డి, ఆదిరెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంగళవారం నాడు జాతీయ న్యాయ సమీక్ష సమావేశం




విశాఖపట్నం (బిఎన్ఎస్): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) ఆధ్వర్యంలో "పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, నిషేధం మరియు పరిష్కారం చట్టం--2013" పై దక్షిణ ప్రాంత న్యాయ సమీక్ష సలహా సమావేశం నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి.

ఈ కార్యక్రమాన్ని డీఎస్ఎన్ఎల్‌యూ, జాతీయ మహిళా కమిషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధారాణి, సమాచార కమిషనర్, న్యూ ఢిల్లీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా చట్టానికి సంబంధించిన అంశాలపై సాంకేతిక సమావేశాలు నిర్వహించనున్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యులు, విశాఖపట్నం బార్‌కు చెందిన ప్రముఖ న్యాయవాదులు మరియు జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు పాల్గొననున్నారు.

# నీరు -ప్రగతి జలహారతి..!



విశాఖపట్నం ( బిఎన్ఎస్) : నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు,విశాఖ జిల్లా కలెక్టర్ ముటెంబాకు అభిషిక్తే కిషోర్ పాల్గొన్నారు.

నీరు - ప్రగతి- జల హారతి నినాదంతో సాగునీటి సంఘాల బలోపేతం చేస్తూ ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జల వనరులను పెంపొందించి కోవాలనే దృఢ సంకల్పంతో నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత అనే భారీ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని ఇందులో అందరూ భాగస్వాములు కావాలని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు కోరారు .

ముందుగా చెరువు ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రమేష్ బాబు సాగునీటి సంఘం అధ్యక్షులు సభ్యులు స్థానిక రైతులు ప్రజలతో మాట్లాడి సాగు విస్తీర్ణం, పంట సాగు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా జలవనరులను పెంపొందింప చేయాలనే లక్ష్యంతో 100 రోజులు ప్రణాళికను ప్రభుత్వం అమలు చేస్తుందని, ఈ కార్యక్రమంలో మొదటి ఐదు రోజులు అధికారులు సర్వే చేసి అవసరమైన నివేదిక తయారుచేసి అనుమతులు పొందుతారని, ఆ తర్వాత 80 రోజుల్లో పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం నీటి వనరులు, పనులు పూర్తయిన తర్వాత నీటి వనరుల లభ్యతపై స్పష్టమైన నివేదిక వెల్లడిస్తారని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అని ఎప్పుడు అధికారంలో ఉన్న వారి అభివృద్ధి కోసం నిరంతరం తపన పడతారని తెలిపారు. పెందుర్తి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున నిధులు మంజూరులో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల కలెక్టర్ అభిశక్తి కిషోర్కు విజ్ఞప్తి చేశారు. రైల్వే ట్రాక్ అవతల సుమారు 250 ఎకరాల సాగుభూములు ఉన్నాయని అక్కడి నుండి పంటలు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని, రైల్వే ట్రాక్ కింద బ్రిడ్జి ఏర్పాటు చేయాలంటూ సరిపెల్లి రైతుల అభ్యర్థనపై స్పందించిన ఎమ్మెల్యే రమేష్ బాబు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్గా ఉన్నారని ఆయనతో చర్చించి అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

అనంతరం కలెక్టర్ అభిశక్తి కిషోర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు చెందిన తాను విశాఖ కలెక్టర్ గా రావడం ఆనందంగా ఉందని, అందులోనూ తొలిసారి పెందుర్తి నియోజకవర్గం సరిపల్లి గ్రామంలో పర్యటించడం జీవితంలో మరిచిపోలేనిదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన చెరువులు అభివృద్ధి సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సరిపల్లి పెన చెరువును అన్ని విధాల అభివృద్ధి చేసి చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు

ఈ యొక్క కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డుమా ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మలా దేవి , జిల్లా ఇరిగేషన్ ఎస్ ఈ అప్పలనాయుడు, మండల ప్రజా పరిషత్ అధికారి అప్పలరాజు ,మండల రెవెన్యూ అధికారి ఇంటి వెంకట అప్పారావు, మండల ఇరిగేషన్ జే ఈ మాలతి, మండలం ఎంపీపీ మాలతి నగేష్, పెందుర్తి గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఈ ఓ ఆర్ డి కామేష్ , పిన చెరువు అధ్యక్షులు గొర్లి రమేష్ పెందుర్తి మండలం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యక్రమంలో పాల్గొన్నారు

# కేశ ఖండన శాలను పరిశీలించిన ఈవో



ఇంద్రకీలాద్రి ,ఏప్రియల్ 6( బిఎన్ఎస్): సుదూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులు నిర్భయంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే విధంగా కేశఖండనశాలను ఆధునికరిస్తున్నామని దుర్గగుడి ఈవో అన్నారు. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా శానిటరీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. భక్తుల కేశ సమర్పణ అత్యంత పవిత్రమైనదని, కేశఖండనశాల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకూడదని క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా చిన్న పిల్లలకు (పసి బిడ్డలకు) తలనీలాలు తీసే సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని నాయీ బ్రాహ్మణులకు సూచించారు. పసిపిల్లల చర్మం సున్నితంగా ఉంటుంది కాబట్టి, ఎటువంటి చిన్న గాయం కూడా కాకుండా చాలా జాగ్రత్తగా, ఓపికగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.దూర ప్రాంతాల నుండి ఎన్నో ఆశలతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులతో సిబ్బంది అందరూ ఎంతో మర్యాదగా, అభిమానంతో మెలగాలని ఆదేశించారు.

తలనీలాలు సమర్పించిన తర్వాత భక్తులు స్నానం చేయడానికి పురుషులకు, మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్లాకుల్లో పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

కేశ ఖండన అనంతరం భక్తులు స్నానాలు ఆచరించే చోట వేడి నీటి సౌకర్యం, నిరంతర నీటి సరఫరా మరియు తగినంత వెలుతురు ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కేసు సమర్పణ కోసం వచ్చే భక్తులకు సౌకర్యంపై,ఏఈవో శ్రీ తిరుమల రావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీ బలరామకృష్ణ వివరాలను అందజేశారు.

# ఏఎంసి చైర్మన్ పల్లి మంగాదేవి కి అభినందనలు తెలిపిన ఎంపీ హరీష్ మాధుర్



కొత్తపేట. బిఎన్ఎస్.ఏప్రిల్.6 రావులపాలెంలో జరిగిన కొత్తపేట అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అమలాపురం పార్లమెంట్ ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఢిల్లీలో పార్లమెంట్ సెషన్స్ జరుగుతున్న సందర్భంగా హాజరు కాలేకపోయారు.

నేడు పల్లి భీమారావు స్వగ్రాహానికి వానపల్లి విచ్చేసి మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవికి ఎంపీ హరీష్ మాధుర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. పల్లి భీమారావు మంగాదేవి దంపతులకు శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు చెల్లి అశోక్ కొత్తపేట టిడిపి నేతలు పోలబత్తుల సుబ్రహ్మణ్యం గనిశెట్టి వీరేష్ నూకల వీరన్న సిద్ధబత్తుల బహుదూర్ అప్పారి శ్రీను అంబటి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారా ప్రముఖులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భేటీ



- కొత్త రాజకీయ ఏర్పాటుపై సమాలోచనలు
- తెలంగాణలో బంజారా సమాజం కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆరా తీసిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

బిఎన్ఎస్ ,హైదరాబాద్ : రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం భేటీ అయ్యారు. హైదరాబాద్ లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లి కవిత మర్యాదపూర్వకంగా ఆయనతో పాటు పలువురు బంజారా ప్రముఖులతో సమావేశమయ్యారు. ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో బంజారా సమాజం కోసం ఏం చేయాలనే అంశాలపై వారితో కవిత చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని.. తాము ఏర్పాటు చేయబోయే పార్టీలకు బంజారా సమాజానికి సముచిత అవకాశాలు ఇస్తామని కవిత హామీ ఇచ్చారు. బంజారా ప్రముఖులు తాము ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీకి సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే వారికి తాము ఏర్పాటు చేయబోయే పార్టీలోకి స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. సమావేశంలో బంజారా ప్రముఖులు, ట్రైబల్ వెల్ఫేర్ మాజీ కమిషనర్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి లక్ష్మణ్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ భీమ్లా నాయక్, బస్కీ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి హరి నాయక్, ట్రైబల్ ఎలక్ట్రిసిటీ బోర్డు అధ్యక్షుడు నారాయణ, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ మీడియా సెక్రటరీ భీముడు నాయక్, ఎలక్ట్రిసిటీ డీఈఈ బాలాజీ నాయక్, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ నాయక్, జాగృతి నాయకులు మోహన్ నాయక్, కళ్యాణ్ నాయక్, సక్రు నాయక్, రవి రాథోడ్, శివ నాయక్, రాంజీ నాయక్, మహేందర్ నాయక్, మానుకోట కళ్యాణ్ నాయక్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# రైతులతో చంద్రబాబు మమేకం



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు తాడిపత్రి నియోజకవర్గం యాడికి సమీపంలోని పెండేకల్ రిజర్వాయర్ వద్ద రైతులతో మాట్లాడారు. బిందు సేద్యం, ప్రకృతి వ్యవసాయం, పీఎండీఎస్, ఉపాధి హామీ సహా వివిధ అంశాలపై రైతులు, కూలీల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులైన నీలం శ్రీనివాసరెడ్డి, లక్కు శ్యామలతో రిజర్వాయర్ పరిధిలో సాగునీటి అవసరాలు, సాగు కోసం ఎలాంటి విధానాలు అవలంభిస్తున్నారన్న అంశాలపై వారితో మాట్లాడారు. రైతులు పరిమి చరణ్ కుమార్, పాపసాని ముని యుగంధర్‌లతోనూ బిందుసేద్యంతో కలుగుతున్న ప్రయోజనాలపై చర్చించారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ప్రభుత్వం తమకు 90 శాతం సబ్సీడికి ఇస్తోందని రైతులు సీఎంకు తెలిపారు. ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్ విధానం ద్వారా చేస్తున్న సాగు గురించి రైతులు హరికృష్ణ, దేవిల నుంచి ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తరహా విధానం ద్వారా సాగు వ్యయం తగ్గుతోందని రైతులు సీఎంకు వివరించారు. సాగులో అర్ధచంద్రాకార గుంతల విధానం ద్వారా నేల సారవంతంగా మారి మెరుగైన ఫలితాలు వస్తున్నట్టు రైతులు నందిని, ప్రమీలమ్మ ముఖ్యమంత్రికి తెలిపారు.

# గౌరారంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బిఎన్ఎస్, ఏప్రిల్ 6 ఉమ్మడి నిజాంబాద్ జిల్లా బ్యూరో: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ హనుమాన్లు, గ్రామ పంచాయతీ అధికారి విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ అనసూయ శంకర్‌తో పాటు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి కొనుగోలు కేంద్రాలకి ధాన్యాన్ని విక్రయించాలని దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని అన్నారు.

# అత్తాపూర్ డివిజన్‌లో ఘనంగా బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవం



బిఎన్ఎస్, అత్తాపూర్ : భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్తాపూర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌లలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొమురయ్య, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాడం సుధాకర్, కార్యాలయ సెక్రెటరీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాచూరి రాజశేఖర్, శశికాంత్ శర్మ, లకం కిట్టు, కిరణ్, వెంకట్ రెడ్డి, నరేష్, స్వప్న, శ్రీనివాస్ రెడ్డి, అనిల్, గాయత్రి, హరి, బాలకృష్ణ, విజయ్ స్వామి, ప్రవీణ్ కమలేకర్, రాజు, మల్లేష్ చారి, అమర్నాథ్ రెడ్డి, వెంకటేష్, శివ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదిరెడ్డిపల్లిలో ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



బిఎన్ఎస్ :భారతీయ జనతా పార్టీ 47వ స్థాపన దినోత్సవం సందర్భంగా మాదిరెడ్డిపల్లి గ్రామంలో పార్టీ శ్రేణులు సంబరాలను అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా గ్రామంలోని 28, 29వ పోలింగ్ బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రవికుమార్, బీజేవైఎం మండల అధ్యక్షులు దగ్గుల శ్రీహరి గౌడ్, బూత్ అధ్యక్షులు దుర్గయ్య తదితరులు పాల్గొని పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను కార్యకర్తలకు వివరించారు. ఈ వేడుకల్లో సీనియర్ నాయకులు పారాయణం గౌడ్, టీ. రవికుమార్, వెంకటేశం, ఎం. రవికుమార్, తుల్జారామ్, సతీష్‌తో పాటు యువ నాయకులు ఆంజనేయులు, కుమార్, శ్రీనివాస్ రెడ్డి, బాలు, ప్రభు, నరోత్తం రెడ్డి, హర్షవర్ధన్ పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నేతలందరూ కలిసి భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేస్తూ పార్టీ పటిష్టతకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

# మండల కేంద్రంలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



బిఎన్ఎస్ :భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాయి. బీజేపీ మండల అధ్యక్షులు సింగితం చంద్రకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రమేష్, చీటిగిద్ద సర్పంచ్ శ్రీధర్, ఉప సర్పంచ్ ధీరజ్ రెడ్డి, అర్జున్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు వార్డ్ మెంబర్లు మల్లేశం, శివ, చందర్ రెడ్డి, లక్ష్మణ్, బీజేపీ ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, రత్నం, బీజేవైఎం అధ్యక్షులు శ్రీహరి, మాజీ మండల అధ్యక్షులు పారాయణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు బందెయ్య, రాములు చారి, రవి, దుర్గయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, వందేమాతరం, అశోక్, శ్రీశైలం మరియు ఇతర కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజా నేత, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



బిఎన్ఎస్ :సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే అపర భగీరధుడు, ఎమ్మెల్యే తిగుళ్ళ పద్మారావు గౌడ్ కు 'బిఎన్ఎస్' దిన పత్రిక పక్షాన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తూ, సామాన్య కార్యకర్త స్థాయి నుంచి డిప్యూటీ స్పీకర్, మంత్రి వంటి ఉన్నత పదవులను అధిరోహించినా, ఆయనలోని సామాన్యుడి మనస్తత్వం మారలేదు. అందుకే ఆయనను ప్రజలు ప్రేమగా 'పజ్జన్న' అని పిలుచుకుంటారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన, పేదలకు సంక్షేమ పథకాల అమలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన పడుతున్న తపన అమోఘం. కరోనా వంటి క్లిష్ట సమయాల్లోనూ, వరదల వేళలోనూ స్వయంగా వీధుల్లోకి వచ్చి బాధితులను పరామర్శించి అండగా నిలిచిన ధీశాలి ఆయన. ప్రజా నాయకుడిగా ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ఆయనకు ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాము.

# రాష్ట్రంలో బెంగాల్ తరహా పరిస్థితులు.. అక్రమ వలసదారులకు రెడ్ కార్పెట్




## కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజం

బిఎన్ఎస్ :హైదరాబాద్‌లో నివసిస్తున్న బెంగాలీ సమాజంతో నిర్వహించిన సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఉపాధి లేక ఇక్కడికి వలస వచ్చిన బెంగాలీలు, తమ మిత్రులు మరియు బంధువులను బీజేపీకి ఓటు వేసేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు. బెంగాల్‌లో ప్రస్తుతం దేశద్రోహులకు, దేశభక్తులకు మధ్య యుద్ధం జరుగుతోందని, అక్కడ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులకు రెడ్ కార్పెట్ పరుస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. దురదృష్టవశాత్తూ తెలంగాణలోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అదే బాటలో నడుస్తున్నాయని, పాతబస్తీలో బంగ్లాదేశీయులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇచ్చి ఆదరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే సరిహద్దుల నుండి అక్రమంగా చొరబడిన వారు ఇప్పుడు దేశంలో అశాంతిని సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై విరుచుకుపడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంఐఎం పార్టీకి దాసోహమయ్యారని బండి సంజయ్ విమర్శించారు. పాతబస్తీలో కార్పొరేషన్ అధికారులు, పోలీసులపై ఎంఐఎం నేతలు దాడులు చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, కానీ హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలుస్తూ ప్రశ్నించిన వారిపై నాన్-బెయిలబుల్ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. లవ్ జిహాద్, డ్రగ్స్ మాఫియాపై తాము పోరాడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, కూకట్‌పల్లిలో హిందూ యువతిపై జరిగిన అమానుష ఘటనలో నిందితులను అరెస్ట్ చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని సవాల్ విసిరారు. ఆలయాలు కట్టడం కంటే ముందు హిందూ సమాజాన్ని, గోవులను కాపాడాలని హితవు పలికారు. కేంద్రం ఇస్తున్న పంచాయతీ నిధులు ఎటు పోతున్నాయని ప్రశ్నించిన ఆయన, రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు.

# పిట్లంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



బిఎన్ఎస్, ఏప్రిల్ 6 ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గ్రామ సర్పంచ్ కుమ్మరి శేఖర్, ఉపసర్పంచ్ అవేజ్ బేగ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పేదలు, అవసరార్థులకు అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, నజీర్, వెంకట్ రెడ్డి, నవీన్, కుమ్మరి యాదగిరి, మొయిన్, ఇమ్రోజ్తో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్

## ప్రేమ లేకపోతే అంతా శూన్యం


స్టార్ హీరోయిన్ త్రిష గత కొంతకాలంగా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. తన వ్యక్తిగత జీవితంపై, ముఖ్యంగా ప్రేమ వ్యవహారాలపై వస్తున్న వరుస పుకార్లతో వార్తల్లో నిలుస్తున్న ఈ చెన్నై అందం, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన కొన్ని పోస్ట్‌లు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. “ప్రేమ అనేది సర్వస్వం కాదు, కానీ అది లేకుండా అంతా శూన్యం” అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీంతో ఈ పోస్ట్ చూసిన వారంతా ఆమె ఎవరితోనో ప్రేమలో ఉందని అందుకే ఇలాంటి పోస్ట్ పెట్టిందని అంటున్నారు. దీనితో పాటు ఆమె పంచుకున్న రెండు వీడియో కోట్స్ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాను ఇప్పుడు జీవితంలో ఒక కొత్త దశలోకి ప్రవేశించానని, అనవసరమైన వాదనలకు దూరంగా ఉండటమే తన ప్రస్తుత సూత్రమని ఆమె పేర్కొన్నారు. “జీవితంలో నేను ఇప్పుడు ఎవరితోనూ వాదించని స్థితిలో ఉన్నాను. ఒకవేళ మీరు ఏనుగు ఎగురుతుందని చెబితే.. అవును మీరు చెప్పింది నిజమే అని చిరునవ్వుతో ఒప్పేసుకుంటాను.

ఎందుకంటే మిమ్మల్ని ఒప్పించేంత ఓపిక, ఆసక్తి నాకు లేవు. సరైనదిగా నిరూపించుకోవడం కంటే మనశ్శాంతి చాలా విలువైనదని నేను నేర్చుకున్నాను. వివరణలు ఇవ్వడం కంటే మౌనంగా ఉండటమే మేలు. ప్రతి ఒక్కరూ మన శక్తిని పొందేందుకు అర్హులు కారు” అని త్రిష ఎంతో లోతైన అర్థం వచ్చేలా చెప్పుకొచ్చారు. ఎదుగుదల అంటే గట్టిగా అరవడం కాదని, కొన్నిసార్లు నిశ్శబ్దంగా ఉండటమే అని త్రిష అభిప్రాయపడ్డారు. “మనం ఇతరుల అభిప్రాయాలను లేదా వారి ప్రవర్తనను నియంత్రించలేము. మనం చేయగలిగిందల్లా మన జీవితాన్ని నిజాయితీగా గడపడమే. ఈరోజు నా వంతుగా నేను ఉత్తమంగా జీవించాను అని తృప్తిగా నిద్రపోగలిగితే చాలు. మన జుట్టు, ముఖం, గొంతు లేదా మనం చెప్పే విషయాలు నచ్చని వారు ఎప్పుడూ ఉంటారు.. మనం అందరినీ మెప్పించలేము” అంటూ తనపై విమర్శలు చేసేవారికి గట్టి కౌంటర్ ఇచ్చారు.



## వెంకీ - అనిల్ రావిపూడి సినిమాలో కృతి శెట్టి ఫిక్స్!

వెంకటేష్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న మూడవ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే ‘ఎఫ్ 2’, ‘ఎఫ్ 3’ చిత్రాలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన ఈ ద్వయం, ఇప్పుడు మరో విభిన్నమైన సబ్జెక్ట్‌తో రాబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో నందమూరి కల్యాణ్ రామ్ ఒక పవర్‌ఫుల్ సర్ప్రైజింగ్ రోల్ పోషిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అయితే తాజాగా అనిల్ రావిపూడి బిగ్ అప్‌డేట్ ఇచ్చాడు.




‘లవ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ (లైక్)’ మూవీ ప్రి రిలీజ్ ఈవెంట్లో.. తన మూవీలో యంగ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటించబోతున్నట్లుగా ‘కృతి... సీ యూ సూన్ ఆన్ సెట్స్’ అని చెప్పకనే చెప్పేశాడు అనిల్ రావిపూడి. ఈ క్రేజీ పెయిర్ ఈ సినిమాలో జతకట్టడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్టైన్మెంట్ తో పాటు, ఈ సినిమాలో ఎమోషన్ యాక్షన్ డోస్ కూడా గట్టిగానే ఉండబోతున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ వంటి సీనియర్ స్టార్‌తో కల్యాణ్ రామ్ స్క్రీన్ షేర్ చేసుకోవడం నందమూరి అభిమానులకు ఒక పెద్ద పండగ లాంటి వార్త అనే చెప్పాలి. ఇక కృతి శెట్టికి కూడా ఈ భారీ ప్రాజెక్ట్ కెరీర్‌లో ఒక మంచి బ్రేక్ ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది.



## ‘స్పిరిట్’లో ప్రభాస్ ఊచకోత ఖాయం

ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని హీరో ప్రభాస్ నటిస్తున్న ‘స్పిరిట్’ చిత్రానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘స్పిరిట్’ సినిమా షూటింగ్ ప్రస్తుతం వేగంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే ఈ చిత్రానికి తాను రెండు పాటలు రాసినట్లు, మరో పాటకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సినిమా ఆల్బమ్ గురించి మాట్లాడుతూ, ప్రేక్షకులు ఒక మంచి క్లాసిక్ టచ్ ఉన్న పాటలను వినబోతున్నారని అన్నారు. దీంతో ప్రభాస్ వంటి మాస్ హీరో సినిమాలో క్లాసిక్ ఆల్బమ్ ఎలా ఉంటుందనే ప్రశ్న ఎదురవగా, సినిమా మొత్తం క్లాసిక్ శైలిలో ఉండదని, అయితే పాటలు మాత్రం ప్రత్యేకమైన క్లాస్ టచ్‌తో కుదిరాయని అనంత శ్రీరామ్ స్పష్టం చేశారు.

అదే సమయంలో ‘స్పిరిట్’ సినిమాలో ప్రేక్షకులకు కావలసినంత యాక్షన్, ఊచకోత సన్నివేశాలు కూడా ఉంటాయని తెలిపారు. అనంత శ్రీరామ్ చేసిన వ్యాఖ్యల ప్రకారం, ఈ చిత్రంలోని పాటలు క్లాస్ టచ్‌లో ఉండగా, ప్రభాస్ పాత్ర మాత్రం పూర్తి స్థాయిలో మాస్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ‘స్పిరిట్’ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తుండగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నారు. టి-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్, ప్రభాకర్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




## సత్తిబాబు పరలోక యాత్ర



‘కపుల్ ఫ్రెండ్లీ’ విజయంతో మంచి జోష్ మీదున్నారు హీరో సంతోష్ శోభన్. ఈ నేపథ్యంలో నెక్ట్స్ సినిమా షూటింగ్‌కి ఆయన సిద్ధమవుతున్నారు. సినిమా పేరు ‘సత్తిబాబు పరలోక యాత్ర’. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఏఆర్ ఫిల్మ్స్ సంస్థ తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. ‘స్వాతిముత్యం’ఫేం లక్ష్మణ్ కె.కృష్ణ దర్శకుడు.

కంప్లీట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందనున్నదని, జూన్ తొలివారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని, ‘కపుల్ ఫ్రెండ్లీ’ తర్వాత యూవీ క్రియేషన్స్ నుంచి వస్తున్న ఈ చిత్రం సంతోష్‌శోభన్‌కి మరో బ్లాక్‌బస్టర్ అవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.